నాటిక:

నేడు - రేపు

●

శ్రీ రా. సీ. ఆంజనేయశాస్త్రి

[మహారాజాగారి భవనం. రాజాగారు సోఫాలో కూర్చుని వుంటారు. ౬౦ ఏళ్లుంటాయి. అయినా, గుర్రపుస్వారీ, కత్తిసాము రోజూ చేస్తూ ఉండటం చేత శరీరం దృఢంగానే వుంది. నిమ్మకాయలు నిలబెట్టగల మీసకట్టులో అక్కడక్కడ తెల్లటి వెంట్రుకలు వెండితీగలల్లే మెరుస్తూ వుంటాయి. దర్బారులో లేకపోయినప్పటికీ, కిరీటం ఖడ్గంవినా, మిగతా రాజోచితవేషమంతా యథాతథంగానే వుంటుంది.

రాజకుమారుడికి యిరవై అయిదేళ్లుంటాయి. తండ్రికెదురుగా మామూలు పేముకుర్చీలో కూర్చుని వుంటాడు. తండ్రిలాగానే మంచి దృఢగాత్రుడు. కత్తిరించిన మీసాలు. సాదాదుస్తులు. రాజసం ఏమాత్రం కనిపించదు మొహంలో. తండ్రీ, కొడుకూ మాట్లాడుకూంటగా తెర లేస్తుంది.]

మహారాజు—ఇంతకీ మేంమాత్రం కాలాని కెదురీదుతున్న దేముంది? మాతృభాషలో చదువు సంధ్యలకీ, నిర్బంధసైనికశిక్షణకీ మొట్టమొదట్లో ఏర్పాటుచేసింది మన సంస్థానంలోనే కదా!...

రాజకుమారుడు—కాదనడం లేదు......కాని పేదా బిక్కీ...

మ.రా—(కొంచెం విసురుగా) మహా తమకే వాళ్లగోడు పట్టుకున్నట్టు! తరతరాల్నుంచీ అన్న సమారాధన రోజూ జరుగుతూనేవుంది. ప్రతి ద్వాదశికీ పుట్లకి పుట్లు వార్పించి సంతర్పణలు చెయ్యడం లేదూ. మేం మటుకు?...

రా.కు—నాకు మహాదుఃఖం కలుగుతుంది ఆ సంతర్పణాల్లో అంతమందిజనం ఎగబడటం చూస్తుంటే.

మ.రా—(ఆశ్చర్యంగా) అదేమిటి? వేలకొద్దీ జనం మృష్టాన్నతృప్తులై వెళ్లుతుంటే నీకు దుఃఖం కలుగుతోందీ?

రా.కు—పట్టెడు మెతుకులకోసం గంటలతరబడీ పడిగాపులు పడివుంటున్నారే పెత్తందార్ల కొరడా ఛెళుకులకి తలఒగ్గికూడా! పాపం ఎంత దుర్భరదారిద్ర్యంలో మునిగివున్నారో వాళ్లు! లేకపోతే, ఆత్మగౌరవం చంపుకుని...

మ.రా—(మొహం పక్కకి తిప్పి) సరిసరి... సంతర్పణాలు మానెయ్యమనా ఏమిటి నీ సలహా?

రా.కు—సంతర్పణాలు చేస్తామన్నా కూడా జనం రారాదు. రావాల్సిన అవసరమే వాళ్లకుండరాదన్నమాట. తిండికి మొహం వాచేటంత బీదరికం ఒకచోటా, మేడలు కట్టి విస్తళ్లెయ్యగలిగినంత భాగ్యం ఒకచోటా...

మ.రా—(అర్ధోక్తిలోనే, తీవ్రంగా)... అయితే ఖజానాలు దోచిపెట్టమనా?...అంతకీ "హరిజనులో, హరిజనులో!" అని గోలపెడుతుంటే, దేవాలయప్రవేశం యిప్పిస్తిమి వాళ్లకికూడా...

రా.కు—నిజమే! కాని అంతమాత్రంచేత...

మ.రా—(విసుగ్గా)... నీకే తృప్తి లేకపోతే, యిహ అలగా వెధవలకేముంటుంది?

రా.కు—పాపం, వాళ్లని అలగాజనంగా తయారుచేసింది మనం కాదూ?

మ.రా—మనం చేసే దేముంది? ఆ పరమాత్ముడు చెయ్యాలి ఏంచేసినా!... "బుద్ధిః కర్మానుసారిణీ" అని...

రా.కు—(వినిపించుకోనట్టుగా) మొన్నీ మధ్య మాలపల్లి వెళ్లితే, వాన జోరున కురవని కొంప ఒక్కటంటే ఒక్కటికూడా కనిపించలేదు. గుడిశలచుట్టూ మురుగునీరు, దోమలూ...పందిగూళ్లు నయం వాటికంటె...

మ.రా—(కొంచెం సానుభూతి ప్రకటిస్తూ) అవునుట పాపం! మొన్నటి గాలివానకి కొంపలన్నీ పడిపోయాయికామాలు! అందుకనేగా, తాటితోపులోంచి తలో తాడీ ఊరికేనే కొట్టుకుపొమ్మని చాటింపేయించాం?

రా.కు—అశ్చే! ఒకటీ అరా తాళ్లవల్ల ఏమవుతుంది? స్థిరమైన యిళ్లు కట్టించిపెట్టాలని ఆందోళన చేస్తున్నారు వాళ్లు.

మ.రా—(కోపంగా) మేడలూ మిద్దెలూ కట్టించిపెట్టొద్దూ? ఇళ్లుట! ఇళ్లు! అసలు నువ్వేటగా రేపెట్టింది వాళ్లకి? మన వంశంలో ఎన్నడైనా వుందీ, మాలామండీల గడప తొక్కడం?...

రా.కు—అందుకనే కదూ, నేను వెళ్లేసరికి పాపం, వాళ్లకి కాళ్లు విరగదొక్కకున్నట్టయింది! ముసలీ ముతకా, "ప్రభువులు మనకొంపలు తొక్కారంటే, ఏం కీడు మూడుతుందో!" అని భయపడ్డారు. నన్ను వెళ్లిపొమ్మని బతిమాలుకున్నారుకూడాను... నాకు చచ్చినచావైంది...మనం మనుష్యులికి దూరమైపోతున్నాం నాన్నగారూ!.........అస్పృశ్యులమయ్యాం...

మ.రా—కట్టిపెడుదూ నీచదువు!......వాళ్లే నయం. పెద్దా చిన్నా, మంచీ చెడ్డా గమనింపు పోలేదింకాను...అవ లీచదువు లొచ్చి నాశనంచేశాయిలే మన సాంప్రదాయాల్నీ, ఆచారాల్నీని. ఇప్పుడే మనుకుంటే ఏంలాభం, నిన్నూ ఆ రొంపిలో దింపాక?...

రా.కు—విజ్ఞానం ఒకరి సొత్తా? ప్రపంచమంతా ముందుకి పోతుంటే, మనం ఆపితేమటుకు ఆ భావాలు ఆగేవా?...

మ.రా—(కొంచెం ఆలోచిస్తున్నట్టుగా) నువ్వు చెప్పిందీ నిజమేలే. కాకపోతే మవ్వన్నా మాతో ఏకీభవించేవాడవేమో నని ఇదవుతున్నా తప్పితే!......ఇంతకీ మొన్న రాజకీయ సభలో మమ్మల్ని వ్యక్తిగతంగా నానాతిట్లూ తిట్టారుటగా? నువ్వూ వింటూ కూర్చున్నావుట మిగతా వాళ్లతోపాటు హర్షిస్తూ!

రా.కు—క్షమించాలి. నేను సైతం మీ చర్యల్ని విమర్శిస్తూ మాట్లాడాకూడాను. కిందటివారం రామచంద్రరావుగారింట్లో జొరబడి సంస్థానోద్యోగులు చేసిన పనులికి మీరే బాధ్యులని ప్రజల విశ్వాసం ...అందుకని, ఆ...

మ.రా—మాకు తెలుసు, రామచంద్రరావుగారు చాలా పెద్దమనిషి. ఆయనతాతగారివరకూ ఎన్నో తరాల్నుంచీ సంస్థానంలో పెద్ద ఉద్యోగాల్లో వున్నవారే. కాని ఆయన యీ గొడవలలో పడటం, ఆయనమీద వచ్చిన ఫిర్యాదులు చాలా తీవ్రమైన వవడం, మరి తప్పనిసరయిందిట యిల్లు సోదాచెయ్యడం...అంత మాత్రంచేత...

రా.కు—అందు కెవరూ ఆక్షేపించడంలేదు. కాని, ఆయన్ని చావదన్ని లారీలో ఎక్కించుకుపోవడమూ, స్త్రీలని నానాదుర్భాష లాడటమూ కష్టం వేసింది. ఇనస్పెక్టరొచ్చి రామచంద్రరావుగారి కూతురిమీద చెయ్యివేశాడుటకూడాను. పిల్లా తల్లితో సహా యింటిల్లిపాదినీ తరిమేసి, యింటికి సీలు వేశారు... ఉద్రేకపడిన జనంమీద తుపాకులు పేలిస్తే నలుగురు చచ్చిపోయారు. శవాల్నికూడా బంధువులికప్పజెప్ప లేదు.

మ.రా—(ఆశ్చర్యంగా) ఇవన్నీ మాకు తెలీదే! సోదాచెయ్యటానికి వెళ్లిన ఉద్యోగులమీద జనం రాళ్లవర్షం కురిపిస్తే, మూకని చెదరగొట్టడానికి గాలిలో తుపాకులు పేల్చవలసొచ్చిందనీ, జనం పారిపోయే తొక్కిడిలో యిద్దరికి స్వల్పమైన గాయాలు తగిలాయనీ మాకు వచ్చిన రిపోర్టు...

రా.కు—కాని యివన్నీ మీయాజ్ఞమీదే జరిపినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. నేను నమ్మక

పోయినా ఊరుకోవాలిసొచ్చింది...ఇప్పుడు, మీకు తెలీదంటున్నారుకనక, ఆ వర్తల్ని ఖండిస్తూ రామచంద్రరావుగారికీ, వారి కుటుంబానికీ తగిన పరిహారాన్ని...

మ.రా—(సాలోచనగా) మాకైతే ఎంతైనా చెయ్యాలనుంది...ఎంత కష్టంగా వుందీ మాకు, రామచంద్రరావుగారి విషయంలో యింత పని జరిగిందని ?! ...కాని...కాని, యివి రాజకీయాలు నాయనా! ప్రధానమంత్రితో సంప్రదించందే ఏ మాటా యివ్వలేను...ఇంతకీ ఎవరివాళ్లు వాళ్లకి కాకపోయింతర్వాత ...(కాస్త తగ్గి)...నిన్నుగురించి ఏమనుకుంటున్నారో తెలుసా?...మామీద ప్రజల్లో ద్వేషం పుట్టించి, మమ్మల్ని పదభ్రష్టుల్ని చేసి, ప్రజాప్రభుత్వం అనే పేరుతో నువ్వు గద్దె కెక్కటానికిగాను ఉద్యమంలో చేరావుట!...

రా.కు—(చిరునవ్వు నవ్వి) అవును, నా చెవినా పడిందా పుకారు. కాని, మీ కుమారుడు నీచుడు కాడని మీకు తెలుసుననే నా నమ్మకం. అందువల్ల నా కా పుకా రేమీ బాధ కలిగించలేదు...

మ.రా—నిజమే కాని, నీ చేతలుమాత్రం...

రా.కు—(ఆర్ద్రోక్తిలోనే, గంభీరంగా) మీకే అనుమానమా? నాయందు విశ్వాసం లేకపోతే, ఇదుగో, నాశిరస్సుని యిప్పుడే ఖండించండి...

మ.రా—(వెరపులో) ఎంతమాట! మమ్మల్ని అవమానపరచడం కాదూ? మాకు తెలుసు మన రక్తంలో అటువంటి నీచాణువు లుండవు...మన వంశాన పూర్వం ఒకతరంలో తండ్రీకొడుకులికి మాటామాటా వచ్చి బాహాటంగానే ద్వంద్వయుద్ధం చేశారుట. అంతే తప్పితే...(నీళ్లు నములుతూ)...ఇంతకీ...మేమేం చేసినా నీకోసం కాదూ?...మన వంశమర్యాదా, గౌరవం నిలబెట్టుకుంటూ, తరతరాలా రాజరికమూ...

రా.కు—(తొందరగా) నాకు రాజరికం అక్కర్లేదు నాన్నగారూ! నే నందు కర్హుణ్ణి కాను...నాకా కోరికే లేదని బహిరంగంగా ప్రకటిస్తే నామీది పుకారుకూడా పోతుంది...

మ.రా—(వ్యాకులతతో) నా తల తీసినట్లు కాదూ, నువ్వలా ప్రకటిస్తే? నే నో రావణాసురుడినయినట్టూ, అందువల్ల నువ్వు రాజ్యాన్నే పరిత్యజించినట్టూ...ముందు నాతల నరికి నువ్వలా ప్రకటించు నాయనా!...

రా.కు—(గద్గదికతో) ...నాన్నగారూ!... నానోరు కట్టేస్తున్నారు...

* * *

రెండో రంగం

[మెహర్ కుర్చీలో కూర్చుని వుంటుంది. పద్ధెనిమిదేళ్లుంటాయి. చక్కని రూపం. సాదావేషం. మొహంలోమటుకు దిగులు కనపడుతూవుంటుంది... చంద్రశేఖరం అటూ యిటూ పచార్లు చేస్తూంటాడు. నల్లగా పొడుగ్గా వుంటాడు. మొరటుమొహం. ఇరవై ఆరేళ్లుంటాయి. కుచ్ఛితంగా కనిపిస్తాడు. మెహర్‌ని మాట్లాడనివ్వకుండానే సాగిస్తాడు తన ధోరణి...]

చంద్ర—అవును...అత నలా కాక యింకోలా ఎలా చెబుతాడు? ఎంతైనా తండ్రికదూ! తనమాదిరి చవటవాజమ్మ ఎవరన్నా నమ్మాలి మహారాజాకి తెలీకుండానే, రామచంద్రరావుగారింట్లో అన్ని రాక్షసకృత్యాలు జరగాయంటేనూ, నలుగురి అరుణరుధిరాన్నీ ఆ పిశాచాలు తాగాయంటేనూ.

మెహర్—(కోపాన్ని సూచిస్తుంది.)

చంద్ర—(కుచ్ఛితంగా నవ్వుతూ) నాకు తెలుసు, నువ్వతనిమీద ఈగనికూడా వాలనివ్వవని...ఎందుకోకూడా తెలుసు!!...

మెహర్—(ప్రశ్నార్థకంగా చూస్తుంది.)

చంద్ర—వేరే నే నెందుకూ? నీ మొహమే చెబుతోంది నువ్వతన్ని ప్రేమిస్తున్నావని...

మెహర్—(తల వంచుకుంటుంది.)

చంద్ర—మొన్నరాత్రి నువ్వూ అతనూ కోట గుమ్మందగ్గిర...

మెహర్—ఊఁ...(అని ఏదో అనబోతుంటే అర్థోక్తిలోనే)

చంద్ర—"సంఘంపనిమీద నువ్వేకదూ పంపింది ?" అనబోతున్నావుకదూ ?...అవును... దాంతోపాటు నీపనీనీ...రాజశేఖరం చెప్పలేదను కున్నావా నాతో ?...అసలు పెద్ద కుట్రే వుందిలే మహారాజా చేయిస్తోంది, రాజకుమారుడిచేత...

మెహర్—(సాశ్చర్యంగానూ, ప్రశ్నార్థకంగానూ చూస్తూ లేచి నుంచుంటుంది.)

చంద్ర—నీకుమాత్రం తెలీకుండా వుందీ ?

మెహర్—("తెలీదు" అన్నట్టుగా తల ఊపుతుంది.

చంద్ర—మూగనోము పట్టావల్లే వుందే యివాళ ?...తన రాజరికం ఎలాగూ నిలవదని మహారాజాకి తెలుసు...తనకి ఊడినా, ప్రజాప్రభుత్వంలో తనకొడుక్కే అధికారం రావడంకోసం రాజకుమారుడిని ఉద్యమంలోకి పంపించాడు. అతను "కార్మిక కర్షకు" లంటూ కబుర్లు దంచుతుంటే, వెర్రిదద్దమ్మలంతా "కుమారరాజాగారంతటివారే మనకోసం పాటుపడుతున్నారు. మహామహులు ! త్యాగులు" అంటూ బ్రహ్మరథం పడుతున్నారు.

మెహర్—("నిజమా ?"అని అనుమానిస్తున్నట్లు చూసి ఏదో అనబోతుంటే—)

చంద్ర—నువ్వింతమాత్రం అనుమానపడక్కర్లేదు మెహర్. బోలెడన్ని నిదర్శనా లున్నాయి. మొన్న రాజకీయమహాసభలో పాల్గొన్న ప్రముఖులందర్నీ అరెస్టుచేశారుకదా ! మనిద్దరిమీదా, సరే, యిదివరకే పుట్టివున్నాయనుకో వారంట్లు! కాని అతని మీదమాత్రం చెయ్యి వెయ్యలేదు. ఎలాగైనా రాజకుమారుడుకదూ !... ప్రజాప్రభుత్వంపేరుతో తమ కర్తవ్యాలనే దురుద్దేశం అతనికి నిజంగానే లేకపోతే ఆ మాట బహిరంగంగా ప్రకటించమంటే ప్రకటించడేంమరి ? పైగా వాళ్ల నాన్నగారుట, యీయనగారి నోరు కట్టేశారుట !! అదో చిదంబర రహస్యం !! వెధవకబుర్లు ! ! ! ఎవరికి తెలీవూ యీ కుట్రలన్నీ ?...

మెహర్—(మునిపళ్లతో కెలిగోళ్లు కొరుక్కుంటూ పాలోచనగా రెండడుగులేసి మళ్లీ కుర్చీలో కూర్చుంటుంది.)

చంద్ర—(తన పాచిక పారుతోందనే ఉల్లాసంతో) అదీగాక, చూడు, మెహర్ !...ఇతర్లని పెళ్లి చేసుకోటం మన సంఘపు కట్టుబాట్లకి వ్యతిరేకం, తెలుసా ? అంతేకాదు... తలెత్తు... ఇదిగో !... యిలాంటిద్రోహుల్నా మరీను... ?

మెహర్—(నిర్లక్ష్యంగానూ, హీనంగానూ అతనివేపు చూసి పక్కకి తిరుగుతుంది)

చంద్ర—(కొంచెం ఆలోచించి, ఏదో గుర్తుకి వచ్చినట్లు)...ఆ...చూశావూ, మెహర్, యింకో రహస్యం...

మెహర్—('ఆఁ...వినేదేమిటి శ్రద్ధా. రహస్యం'...అన్నట్టుగా, నిశ్చలంగా యిందాకటి మాదిరే కూర్చుని వుంటుంది.)

చంద్ర—నీపుటకవిషయం అన్నమాట—

మెహర్—(చప్పున అతనివేపు తిరిగి, కొత్త కంఠంతో)...ఆఁ !?

చంద్ర—అవును...చచ్చిపోయిన నీతల్లి బోగంది. ఆమెను మహారాజా వుంచుకున్నాడు. అన్నాచెల్లెళ్ల పెళ్లా ? (క్రూరంగా నవ్వుతాడు.)

మెహర్—(పిడుగు పడ్డట్టు తల వాల్చి, "నమ్మమంటావా?" అన్నట్లు దీనంగా చూస్తుంది కన్నీరు కారుస్తూ.)

చంద్ర—అలా చూస్తావేం ? అతన్నే అడుగు, కావాలంటే !... మెహర్, నీకోసం నేను...(అంటూ కుర్చీమీద చెయ్యివేస్తాడు.)

మెహర్—(తటాలున కుర్చీలోంచి లేచి నుంచుంటుంది.)

చంద్ర—నీ పలుకే బంగారమైపోయిందేం మెహర్ యివాళ ?...సంస్థానంలో చిచ్చుపెట్టాం... ఇహ చాలు...ఇక్కడుంటే, మనని ఎలాగో పట్టేస్తారు. యివాళ కాకపోతే రేపు...కనక మన మిద్దరం సంస్థానంలోంచి పారిపోయి...ఎక్కడో సుఖంగా...

మెహర్—(భీడపురుగుని విదిలించినట్టుగా విదిలిస్తూ రెండడుగులు ముందు కేస్తుంది.)

చంద్ర—(రోషంతో) నీమీద ప్రేమకొద్దీ యింతకాలం నేను వేచివున్నాను...లేకపోతే అతని నెత్తురు కళ్ల చూసివుందును యీపాటికి...

మెహర్—ఛూ:...(అని వెళ్లిపోతుంది.)

చంద్ర—(పళ్లు పటపటా కొరుకుతూ) ఇప్పుడు మీయిద్దరి నెత్తురూ కళ్లచూస్తాడీ చంద్రశేఖరం...

(తెర పడుతుంది చకచకా)

*   *   *

మూడో రంగం

[అర్ధరాత్రి. కోటగుమ్మం దగ్గిర రాజకుమారుడూ, మొగవేషంలో ఉన్న మెహర్ మాట్లాడుతూవుంటారు. ఫారాజవానుకేకా, మాటలూ తెర వెనక వినిపిస్తూంటాయి.]

మెహర్—(నిట్టూర్పు విడుస్తూ) సంఘంలోంచి వచ్చేశాకా నామీద వాళ్లంతా కసిపూని తిరుగుతున్నారు, పొడిచేద్దామని...

రా.కు—ఎందుకూ పొడవడం?...

మెహర్—అసలుకారణం, చంద్రశేఖరాన్ని నేను పెళ్లిచేసుకోలే దని. చెప్పడంమటుకు "సంఘంలోంచి వెళ్లిపోయి ద్రోహం చేసిందికనక, బతకనిస్తే మన రహస్యాలు బయటపెడుతుంది. అందుకని చంపేయ్యాలి"అని చెప్పి, సంఘంలోవాళ్లకి పురెక్కించాడు చంద్రశేఖరం.

రా.కు—అంత దీక్షగా ప్రాణాలకికూడా తెగించి పనిచేసిన నిన్నే వాళ్లే హత్యచెయ్యాలనా యిప్పుడు?...

మెహర్—అంతే కాదు. నేనేం లెక్క? అతన్ని నమ్ముకున్న వందలాది మనుష్యుల్ని నట్టేట ముంచి "చిచ్చుపెట్టాంగా? చాలు. యిహ మనిద్దరం సంస్థానం విడిచి పారిపోదాం" అన్నాడు చంద్రశేఖరం నాతో. మొన్నరాత్రి కర్రలతో ఎదురుతిరిగి సంస్థానోద్యోగుల్ని చావబాదిన రైతులు "మిలిటరీవాళ్లొచ్చి కాలుస్తారని పుకారుగా వుంది. ఏం చెయ్యమంటారు?"అని అడగ్గా చంద్రశేఖరం మొహం తప్పించాడు...

రా.కు—ఎంత ఘోరం? హింసాపథం నీతులకీ, బాధ్యతలకీ చోటివ్వదేమో!!...

మెహర్—మహారాజాగార్ని చంపాలని చేసిన కుట్రలో నాకూ భాగం వుంది...వారు నాకు తండ్రులని తెలీదు అప్పటికి...చంద్రశేఖరమే మొన్న బయట పెట్టాడు...(ఏడుస్తుంది.)

రా.కు—అవును...పాపం. మీఅమ్మ నిన్ను కనగానే చచ్చిపోయింది. నన్ను ఎత్తుకుంటూవుండేది కూడాను...నాకు కొద్దిగా గుర్తుకూడా వుంది...

మెహర్—నా కెందుకు చెప్పలేదూ, యింతకాలమూను?

రా.కు—సంఘం ఎంత ముందుకు పోయినా, యింకా పాతవాసనలు చావలేదు. వేశ్యపుత్రివని నీకుగాని, యితరులకిగాని తెలియకుండా వుండటమే మంచి దని ఊరుకున్నా.

మెహర్—కాని యిప్పు డెంత ప్రమాదం జరిగిందో గమనించారా?

రా.కు—దాని కేం మెహర్? ఎవరు నమ్మిన పంథాలో వాళ్లు స్థైర్యంగా సంచరించడం ధర్మం. హింసాపథంలో నమ్మక ముండి నువ్వు కుట్రలో పని చేశా వనుకో. తండ్రయితే నేం? అన్నయితే నేం?... ఇంతకీ కుట్ర ఫలించలేదుగా నువ్వు దుఃఖించటానికైనా?...అదిగో, యింకా ఏడుస్తున్నావా?...

మెహర్—(దుఃఖా న్నాపుకుంటూ) అది కాదండీ...నే నింకా ఘోరమైన అపచారం చేశా...

రా.కు—అంటే?...

మెహర్—(మొహం చేతులతో మూసుకుంటూ) ...మిమ్మల్ని...ప్రేమించా...

రా.కు—(నిట్టూర్పు విడుస్తూ)...నిజమేనా మెహర్? నే నెంత దౌర్భాగ్యుణ్ణి? చెల్లెలిలో అలాంటి ప్రేమని రేకెత్తించిన యీ నా నికృష్ట శరీరం...

మెహర్—(కొంచెం తమా యించుకుని)... అయ్యయ్యో! అదేం మాట! నా కండకావరం కన్ను మిన్ను కానకుండా చేసింది...నా కేం దారి యిహ? హింసలో నమ్మకం లేకపోయినా పరిసరాల ప్రభావంవల్ల హింసకి ఒడబడ్డాను. అప్పుడు కుట్ర ఫలించనందుకు విచారపడ్డా—'ఆ వ్యక్తి నే నూహించు కుంటున్న పతికి తండ్రి' అని తెలిసికూడా. ఆ వ్యక్తి నాకుకూడా తండ్రి అని తెలిసిం దిప్పుడు. ఇహ నేను సంతోషించాలా, దుఃఖించాలా?...అన్న అని తెలీక మిమ్మల్ని ప్రేమించా. తెలుసుకుని యిప్పుడు దుఃఖి స్తున్నా...కుట్రలో ఉన్నానని ప్రభుత్వమూ, సంఘంలోం చొచ్చేశానని వాళ్లూ నన్ను వేటాడు తున్నారు. ఇంతవరకూ నేను చేసిన దుష్కృత్యాల పశ్చాత్తులు నా ఆత్మని రంపాన రాస్తున్నాయి... ఏం చెయ్యను అన్నగారూ... (ఏడుస్తుంది వలవలా.)

రా.కు—(గద్గదికతో) చెల్లీ, నేను తుంత వ్యుణ్ని కాను...నీకష్టాలకి కారకుణ్ని నేనుకదూ?... నీకోరిక చూచాయగా నేను గ్రహించికూడా మెదల కుండా ఊరుకున్నా నీ జన్మరహస్యం బయులుపెట్టాలి సొస్తుందని...మొన్న చంద్రశేఖరం గుచ్చిగుచ్చి అడ గడంవల్ల చెప్పక తప్పలేదు...అదీ కొంత మేలే అయింది...

మెహర్—(దుఃఖంతోనే) మానాన్నగారికి నా సంగతి తెలుసా?...

రా.కు—తెలీకేం మెహర్? నేనూ, నువ్వూ కూడా తనకి వ్యతిరేకంగా పని చేస్తున్నామని మహా వ్యథ పొందుతున్నారు...

మెహర్—నా కిహ మరణమే శరణ్యం అన్న గారూ!...

రా.కు—ఛీ! అది పిరికిలక్షణం. ఉద్యమం ఫలించే రోజు లొస్తున్నాయి. నాన్నగారుకూడా... (తెరలోకి చూస్తూ) చింతతోపులో ఏమి టా అలి కిడి?...ఫారాజవాక్!!...

ఫారాజవాక్—(తెరలోంచే) చిత్తం!...

రా.కు—ఆ చింతతోపులో అలికి డేమిటో చూసి రండి.

ఫా.జ—చిత్తం!...

రా.కు—పిరికిలక్షణం మెహర్, ఆత్మహత్య!...

మెహర్—నన్నీపాపాలూ, వ్యథా విడిచి పెట్టవు జీవించి ఉన్నంతకాలం.

రా.కు—పశ్చాత్తాపాగ్ని నిన్ను దహించేస్తోంది. నువ్వు ప్రభుత్వానికి వెంటనే వశమయిపో...

మెహర్—తరవాత?...

రా.కు—తరవాతా?......(తుపాకిశబ్దం విని పిస్తుంది)...అదేమిటి?...

మెహర్—చంద్రశేఖరం కాదుకదా? నన్ను వెంటాడుతున్నాడు లెండి...

రా.కు—అయితేమటుకు? తుపా కెందుకు?... (తెరలోకి చూస్తూ)అరే! భుజా న్నెవరో వేసుకుని ఫారాజవాను పరిగెత్తుకొస్తున్నాడే!...

మెహర్—(తెరలోకి చూస్తూ) అదేమిటి, గుండెల్లోంచి నెత్తురు కారుతోంది? చంద్రశేఖ రమే!...

రా.కు—అతనే?...ఏమి టీ హత్య? ప్రాణం పోలేదు కదా?

ఫారాజవాక్—(తెరలోంచి వస్తూ) పోయే వుంటుందండి...చూడగానే గుర్తుపట్టావండి...పారి పోతుంటే కాల్చమని ఆజ్ఞ బాబూ. కాళ్లకి గురిపెట్టి కాల్చేసరికి తప్పించుకుంటానికి నేలమీద పడుకున్నా డండి...అందుకని గుండెల్లో తగిలిందండి...

రా.కు—(ఆదుర్దాతో) అయ్యయ్యో! ఎంత దారుణం, ఎంత దారుణం!! త్వరగా ఆసుపత్రికి తీసుకుపో! (మెహర్‌తో)...మెహర్! మెహర్!! చూస్తూచూస్తూండగానే ఎంత ఘోరం జరిగింది?

మెహర్—(నిశ్చలంగా) లేకపోతే మనిద్దరి ప్రాణాలూ ఎగిరిపోయేవి. మనిద్దర్నీ చంపటానికే అతను వచ్చివుంటాడు.

రా.కు—అందుకేనంటావా?.........అయితే మటుకు? అతను నిన్ను నిజంగానే గాఢంగా ప్రేమి స్తున్నాడేమోనమ్మా?...అతని ప్రాణం పాపం ఎలా వుందో! పోదాం పద ఆసుపత్రికి.

మెహర్—(శుష్కంగా నవ్వుతూ) మీ హృదయం నవనీతం...

(ఇద్దరూ త్వరత్వరగా వెళుతూండగా తెర పడుతుంది.)

* * *

నాలుగో రంగం

[సాదా వేషంలో మహారాజా, మామూలు వేషంలోనే రాజకుమారుడూ, గుండెకి కట్టుతో చంద్రశేఖరమూ ప్రవేశిస్తారు.]

మహారాజు—గాయం నయమవుతోందా నాయనా?

చంద్రశేఖరం—(వేదనతో) గుండెమీది గాయం నయమవుతోంది కాని గుండెలో తీవ్రమైన గాయం చేస్తున్నారు స్వామీ...మీరు...

రాజకుమారుడు—అదేమిటి చంద్రశేఖరం?...

చంద్ర—రాజ్యాంగంలో సర్వహక్కులూ ప్రజలకిస్తూ మహారాజాగారు చేసిన ప్రకటన నాకు సంతోషాన్నీ, దుఃఖాన్నీ కూడా కలిగిస్తోంది.

మ.రా—చంద్రశేఖరంకూడా మారుతున్నాడేమిటి?

చంద్ర—నేనిప్పుడు సిగ్గుతో చచ్చిపోతున్నా స్వామీ! మిమ్మల్ని హత్య చెయ్యటానికి పూనుకొన్న నాకు సంపూర్ణస్వేచ్ఛ నిచ్చారు.

మ.రా—దానికేంలే! నామీద నీకు వ్యక్తిగతంగా ద్వేషం ఏముందీ, వ్యవస్థతో పోరాటం తప్పితే? ఆ వ్యవస్థ మారేసరికి అంతా స్నేహితులమే!

చంద్ర—అదే కాకుండా, మెహర్ నన్ను నిరాకరించడంచేత ఆమెనీ, దానికి కారణభూతులని రాజకుమారునీ, హత్యచేయ తలపెట్టాను. ఇది స్వార్థం కాదూ!...కేవలం...

రా.కు—స్త్రీశక్తి అటువంటిది లే చంద్రశేఖరం! గాఢప్రేమ ఎంత పనన్నా చేయిస్తుంది. అందుకు నువ్వు విచారించకు.

చంద్ర—(దుఃఖంతో) మీకు హృదయం లేదనీ, అటువంటప్పుడు అది మారడం అనేది అసంగత మనీ, కనక రాజవంశంలో ఒక్క పురుగన్నా లేకుండా నాశనం చెయ్యాలనీ నమ్మాను. ప్రచారంచేశాను, ప్రయత్నించాను...ఇప్పుడు తెలిసింది హృదయం లేనిది నాకని...

రా.కు—నీకూ వుంది హృదయం, చంద్రశేఖరం! లేకపోతే యిప్పుడింత బాధపడవు... ఎందుకులే యిహ పాతవి తవ్వుకోటం!

మెహర్—(ప్రవేశించి) పట్టీ మార్చాల్సిన వేళయింది. రండి, కట్టు కడతా...

చంద్ర—(మెహర్ని చూసి మరీ ఖిన్నుడవుతూ)...సానుభూతిపూర్ణమైన ఆమె ప్రతిపలుకూ నన్ను శూలంలాగా పొడుస్తోంది.

మెహర్—(తీవ్రంగా) మీ కన్నిమాట్లు చెప్పినా తెలీదేం? డాక్టరుగారేమన్నారు? అలా విచారపడితే గాయం నయం కావడం కష్టమని చెప్పలేదూ?

చంద్ర—నాదురంతాన్ని మీముందు వెళ్లబోసుకుంటేనే గాని నా హృదయభారం తీరదు. మహారాజాగారూ మీరూ కూడబలుక్కుని, ఒకరు కాకపోతే ఒకరు అధికారంలోకి రావచ్చుననే ఉద్దేశంతో మిమ్మల్ని వారు ప్రజోద్యమంలోకి పంపారనీ, కనక మిమ్మల్ని ముందు హత్యచెయ్యాలనీ బోధించాను. కాని ఎవరూ ఆ పనికి పూనుకోకపోయేసరికి, యీ నీచుడే అందుకు తయారయాడు...నరకంలోనన్నా నాకు చోటు దొరుకుతుందా మహారాజా?

మ.రా—ఆ సంబోధన యిహ మానెయ్యి చంద్రశేఖరం...ఎవర్ని ప్రజ లెన్నుకుంటే ఆయనే అధికారన్న మాట.

రా.కు—ఇదిగో, పాతసంగతులిహ ఎత్తితే పూరుకోను. ఎన్నిసార్లు చెప్పాలి నీకు, చంద్రశేఖరం? అసలే బలహీనంగా వుంటావు!

మెహర్—నామీద ఒట్టు, మీ రింకా ఆ కథలు తవ్వుకుని దుఃఖించారంటేను!...మహారాజాగార్ని కాక మరొకరి నెందుకెన్నుకుంటారు ప్రజలు కుటుకు?...నిజంగా హృదయం గలవారు వారే!...

మ.రా—(నవ్వుతూ) లేం దెవరి కమ్మాయీ!... సమయం ఒచ్చేసరికి అదే కనిపిస్తుంది...(చంద్రశేఖరం వేపు తిరిగి) మనుష్యుని మానవత్వంలో విశ్వాసం ఉంచాలి తప్పితే...

రా.కు—పరిపత్నభుక్యలు కనిపెట్టుకు కూర్చుంటారేమో! వేళకూడా అయింది...లేవండి వెడదాం... (మెహర్ వేపు తిరిగి) మెహర్, చంద్రశేఖరానికి కట్టు కట్టి మీ రిద్దరూకూడా రండి...వెంటనే.

(మెహర్, చంద్రశేఖరమూ ఒక వేపుకీ, రాజకుమారుడూ, మహారాజా మరో వేపుకీ వెళుతూండగా తెరపడుతుంది.)